సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 12 । జనవరి । 2023



71.902 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 71.902 టీఎంసీలు ఉన్నాయి. 2,643 క్యూసెక్కుల వరద వస్తోంది. పెన్నార్ డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 553, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,810
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,164
3 శాతం జీఎస్టీతో	రూ.5,319
సవర (8 గ్రా)	రూ.42,552

గరిష్ఠం/కనిష్ఠం
30.1 /20.0

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా గురువారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో పగటి పూట చలి తీవ్రత ఎక్కువగా ఉంది. గాలిలో తేమ 64 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు 223 ప్రాజెక్ట్‌ల ఎంపిక

నెల్లూరు(టౌన్): జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు 223 ప్రాజెక్ట్‌లు ఎంపికయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,300 ప్రాజెక్ట్‌లకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకొన్నారు. జాతీయ స్థాయిలో ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్ట్‌ల వివరాలను పరిశీలించారు. అందులో ఉత్తమమైన వాటిని ఎంపిక చేశారు. రాష్ట్రంలో ప్రాజెక్ట్‌ల ఎంపికలో జిల్లా 5వ స్థానంలో నిలిచింది.

ఫిబ్రవరి 26 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు జరగనున్నట్లు ఆర్‌ఐఓ వరప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. వృత్తి విద్యా కోర్సులకు ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఫిబ్రవరి 15న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 17న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయని తెలిపారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు



ట్రావెల్స్ యజమానులతో సమావేశం నిర్వహిస్తున్న డీటీసీ చందర్

నెల్లూరు (టౌన్): సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీటీసీ చందర్ తెలిపారు. బుధవారం నెల్లూరులోని రవాణా కార్యాలయంలో ట్రావెల్స్ బస్సుల యజమానులు, బుకింగ్ ఏజెన్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రుజువైతే వాహనాలపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని ప్రాసిక్యూషన్‌కు పెడతామని హెచ్చరించారు. ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు ప్రతి రోజు తనిఖీలు చేసే విధంగా డ్యూటీలు వేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్టీఓలు మురళీమోహన్, సుధాకర్‌రెడ్డి, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, కార్తీక్‌పవన్, పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అదనంగా 30 వేల ఉపాధి పని దినాలు

- డ్వామా పీడీ వెంకట్రావ్



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లాకు అదనంగా 30 వేల పనిదినాలు కల్పించామని డ్వామా పీడీ వెంకట్రావ్ తెలిపారు. బుధవారం డ్వామా కార్యాలయం నుంచి మండల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. ఇప్పటికే 85 వేల పనిదినాలు పూర్తి అయ్యాయన్నారు. మార్చిలోగా అదనంగా కేటాయించిన పని దినాలు పూర్తి చేసేలా దృష్టి సారించాలన్నారు. జిల్లా పీడీ నుంచి ఏపీడీలు, ఎంపీడీఓలు, ఏపీఓలు ఈసీలు టీఏఎఫ్‌ఏలు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో ఉండాలన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు ఉపాధి కూలీలకు సంబంధించి ఆధార్ లింక్ ప్రక్రియను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. నూతన నిబంధనల ప్రకారం పనులకు హాజరైన కూలీలను ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.





పవర్ ఫుల్



వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోంది. విత్తనం నుంచి ఎరువులు, వ్యవసాయ ఉపకరణాల వరకు, సాగు ప్రారంభం నుంచి పంట కోతల వరకు, సాగు పెట్టుబడి, వడ్డీ రాయితీలు అందిస్తూ, గిట్టుబాటు ధరలు కల్పిస్తూ ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రధానంగా సాగునీటి వసతి కల్పించడం కోసం జలవనరులు అభివృద్ధి చేస్తోంది. నీటి పారుదల వసతి లేక, మోటార్లపై ఆధారపడిన రైతులకు పుష్కలంగా సాగునీటిని అందించాలనే లక్ష్యంతో సరిపడినంత విద్యుత్ సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా రైతులు అడిగిన వెంటనే ప్రభుత్వమే ఖర్చులు భరించి ఉచితంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు చేస్తోంది.

- అడిగిన వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- ఒక కనెక్షన్ కోసం రూ.22 వేల ఖర్చు భరిస్తున్న విద్యుత్‌శాఖ
- 10 నెలల్లో 9,426 కనెక్షన్ల మంజూరు
- 28,338 ఎకరాలకు మోటార్ల ద్వారా సాగునీరు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): గత ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందాలంటే గగనంగా ఉండేది. కనెక్షన్ మంజూరు అయినా అన్ని ఖర్చులు రైతులే భరించారు. అప్పట్లో ఏడాదికి పరిమిత సంఖ్యలోనే వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయడంతో రైతులు ఎదురుచూస్తూనే ఉండాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో రాజకీయ నాయకుల ఒత్తిడి, ఎవరైతే అమ్యామ్యాలు ఇచ్చే వారో అడ్డదారిలో ప్రాధాన్యత ఇచ్చి కనెక్షన్లు ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులకు భిన్నంగా రైతు అడిగిన వెంటనే రూపాయి ఖర్చు లేకుండా వెంటనే ప్రభుత్వం కనెక్షన్ ఏర్పాటు చేస్తోంది. ఏ రాజకీయ ఒత్తిళ్లు లేవు. పైరవీలు లేవు. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు రైతుల అర్హతలు పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విద్యుత్ అందుబాటులో నుంచి కనెక్షన్లు ఇస్తున్నారు. విద్యుత్ సర్వీసు అందించడం కోసం ఒక్కొక్క కనెక్షన్ కోసం మూడు విద్యుత్ స్తంభాలు, వైరు (కండక్టర్), కాసారం, ఇన్సులేటర్, లేబర్ చార్జీలకు అయ్యే రూ.22 వేలను పూర్తిగా విద్యుత్ శాఖనే భరిస్తోంది.

ఏడాదిలో రూ.20.73 కోట్ల ఖర్చు

ఒక వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ (5హెచ్‌పీ) కోసం అందుబాటులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రైతు పొలం వరకు మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తోంది. 180 మీటర్ల నూతన విద్యుత్ లైన్‌ను వేసి విద్యుత్ సరఫరా అందజేస్తోంది. ఈ ప్రక్రియలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మూడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు రూ.12 వేలు, నూతన విద్యుత్ లైన్ (కండక్టర్), కాసారాలు, ఇన్సులేటర్లకు రూ.6 వేలు, లేబర్ చార్జీలు (కూలీలు)కు ఖర్చు రూ.4 వేలు వంతున మొత్తం రూ.22 వేలను విద్యుత్ సంస్థే భరిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. ఈ లెక్కన గత పది నెలల కాలంలో 9,426 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పొందిన రైతులకు విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.20,73,72,000 ఖర్చు చేసింది.

పంటపొలాలు సస్యశ్యామలం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 1,88,526 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో గతేడాది 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 10 నెలల కాలంలో 9,426 విద్యుత్ సర్వీసులు ఇచ్చారు. ఇవి కాకుండా మరో 1,855 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకోగా వీరందరికీ మరో రెండు నెలల్లో కనెక్షన్లు ఇచ్చే అవకాశం ఉంది. ఒక్కొక్క సర్వీస్ కింద 3 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఈ ప్రకారం ఉమ్మడి జిల్లాలో 5,65,578 ఎకరాలకు మోటార్ల ద్వారా సాగునీరు పారుతోంది. ఇందులో వరితో పాటు మెట్ట పైర్లు, ఉద్యాన తోటలు ఉన్నాయి.

విద్యుత్ పరికరాల కొరత లేదు



గతంలో మాదిరిగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం వేచి చూసే పరిస్థితి ఇప్పుడు లేదు. గతంలో సంవత్సరానికి ఇన్ని మాత్రమే వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇవ్వాలన్న నిబంధన ఉండేది. ఇప్పుడు అడిగిన వెంటనే కనెక్షన్లు ఇస్తున్నాం. సంస్థ స్టోర్స్‌లో విద్యుత్ స్తంభాలు, వైర్లు, విద్యుత్ పరికరాల స్టాక్ ఉంది. దీంతో దరఖాస్తు చేసుకున్న సత్వరమే కనెక్షన్లు ఇచ్చే వీలు కలుగుతోంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లు కూడా రెండు నెలల్లో ఏర్పాటు చేస్తాం.

– వెంకటసుబ్బయ్య, ఎస్‌ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

అప్పట్లో ఒక్క స్తంభానికే రూ.20 వేలు ఖర్చు చేశా



ఇరవై ఏళ్ల క్రితం నా పొలానికి నీటి సౌకర్యం కోసం విద్యుత్ సర్వీసు కనెక్షన్ తీసుకున్నాను. నా పొలానికి దగ్గరగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కనెక్షన్ ఇచ్చేందుకు అదనంగా ఒక విద్యుత్ స్తంభం కావాల్సి వచ్చింది. దీని కోసం అప్పట్లోనే రూ.20 వేలు సొంతంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఉచితంగా 3 విద్యుత్ స్తంభాలు వేసి, లైన్ వేసి ఇస్తోంది. ఇది రైతు ప్రభుత్వమని చెప్పడానికి ఇదే ఉదాహరణ.

– తోటపల్లి హరిబాబురెడ్డి, రైతు, పడుగుపాడు, కోవూరు మండలం

సామాన్య రైతుకు ఎంతో ఉపయోగకరం



వ్యవసాయ విద్యుత్ సర్వీసు పొందే రైతులకు విద్యుత్ శాఖ ఉచితంగా రూ.22 వేలతో మూడు విద్యుత్ స్తంభాలు, 180 మీటర్ల విద్యుత్ లైన్ వైరు, కాసారాలు, ఇన్సులేటర్స్ ఉచితంగా అందజేస్తోంది. ఇది సామాన్య రైతుకు ఎంతో ఉపయోగంగా మారింది. రైతు పక్షపాతిగా ప్రభుత్వం వ్యవహరిస్తుండడంతో రాష్ట్రంలోని రైతులు అందరూ ఆనందంగా వారి పొలాలను సాగు చేసుకునే వీలుకలుగుతోంది.

– కోటంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రైతు, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

చిరు వ్యాపారులకు అండగా జగనన్న తోడు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ చక్రధర్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి, అధికారులు




లబ్ధిదారులకు మెగా నమూనా చెక్కును అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.19.09 కోట్ల జమ
- వడ్డీ రీయింబర్స్‌మెంట్ రూ.58.80 లక్షలు
- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో నిరుపేదలైన చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారికి జగనన్న తోడు పథకం ఎంతో అండగా నిలుస్తోందని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం జగనన్న తోడు ద్వారా వడ్డీ లేని రుణాలు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అనంతరం సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో మొత్తం ఆరు విడతల్లో 1,39,999 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.139.99 కోట్లు వడ్డీ లేని రుణాలు అందించామన్నారు. ఈ ఏడాది సకాలంలో రుణం చెల్లించిన 30,743 మందికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.58.80 లక్షలు అందిస్తున్నామన్నారు. ఏరోజుకారోజు అధిక వడ్డీలకు, తండల్‌కు అప్పులు తెచ్చుకుని వ్యాపారాలు చేసే వారికి జగనన్న తోడు రుణాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. నిరుపేద వ్యాపారులు అప్పులు పాలు కాకుండా ఉండాలన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించడం ద్వారా మళ్లీ మళ్లీ వడ్డీలేని రుణాలు పొందాలని కోరారు. అనంతరం నూతనంగా 19,093 మందికి రూ.19.09 కోట్ల మెగా చెక్కును, 30,743 మంది లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద రూ.58.80 లక్షల మెగా నమూనా చెక్కును లబ్ధిదారులకు కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సయ్యద్ ఆసిఫా, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాది యూపీ అయినా రుణం మంజూరు



మాది ఉత్తరప్రదేశ్. నేను ఉపాధి కోసం నెల్లూరు వచ్చాను. పాప్‌కార్న్ బండి వేసుకుంటూ బతుకుతున్నాను. నా వ్యాపారానికి ఇంతకు ముందు తండల్‌కు తెచ్చుకునే వాడిని. ఇప్పుడు వలస వచ్చిన నాకు సైతం చిరు వ్యాపారుల కింద గుర్తించి రూ.10 వేలు రుణం అందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎంతో రుణపడి ఉంటా.

– షాహుల్, నెల్లూరు

పచ్చళ్ల వ్యాపారాభివృద్ధి



చిరు వ్యాపారుల కింద తనకు రూ.10 వేలు మంజూరు చేయడంతో నేను పచ్చళ్ల వ్యాపారం పెట్టుకుని అభివృద్ధి చెందుతున్నాను. రుణం సక్రమంగా చెల్లించడంతో వడ్డీ కూడా ప్రభుత్వం తిరిగి జమ చేసింది. సకాలంలో ఇలా రుణం చెల్లించడం ద్వారా మళ్లీ మళ్లీ రుణాలు పొందే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– కల్పన, పడారుపల్లి

గాజుల వ్యాపారానికి ప్రభుత్వ సాయం



నేను గాజుల వ్యాపారం చేసుకుంటున్నాను. వలంటీర్ నన్ను గుర్తించి చిరు వ్యాపారం కింద దరఖాస్తు చేయించి రూ.10 వేలు వడ్డీ లేని రుణం అందేలా చేశారు. ఈ నగదును వ్యాపార అభివృద్ధికి వినియోగించుకుంటాను. ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

– ఎం.రాణి, టైలర్స్‌కాలనీ, నెల్లూరు

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం అభివృద్ధికి కృషి



మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడితో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును మంత్రి కాకాణి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం గురించి చర్చించారు. అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా, ఉపరాష్ట్రపతిగా ఉన్న సమయంలో వెంకయ్యనాయుడు జిల్లా అభివృద్ధికి, ముఖ్యంగా వెంకటాచలం మండలం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి ప్రభుత్వ భూమిని ఉచితంగా 5 ఎకరాలు కేటాయిస్తే, ఆ భూమిపై ఎలాంటి హక్కులు లేనటువంటి వ్యక్తులు కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారన్నారు. ఈ కేంద్రం అభివృద్ధిపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చర్చించారని, త్వరలో స్టే తొలగించేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు. ఈ కేంద్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. మహాకవి తిక్కన నడయాడిన జిల్లా కావడంతో అలాంటి వ్యక్తుల విగ్రహాలు ఈ కేంద్రంలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య పాల్గొన్నారు.

ఇంత బాధ్యతా రాహిత్యమా?

- అధికారులపై కలెక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (పొగతోట): సమావేశాలకు సమయానికి రాకపోవడం, కనీసం గౌరవప్రదంగా వ్యవహరించకపోవడం చూస్తుంటే ఇంత బాధ్యతారాహిత్యమా అని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గణతంత్ర దిన వేడుకలకు సంబంధించి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల్లోగా హాజరుకావాలని జిల్లా అధికారులకు నాలుగు రోజుల క్రితమే సమాచారం ఇచ్చారు. జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో హాజరుకాకపోవడంపై కలెక్టర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశాలకు ఆలస్యంగా వస్తారు.. వచ్చినా మొబైల్ ఫోన్లు చూసుకోవడానికి సరిపోతుంది. అధికారులంటే కనీస గౌరవం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన అధికారులకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఇచ్చే అవార్డుల్లో కూడా వారి పేర్లు నమోదు చేయొద్దంటూ సంబంధిత అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులకు ఉద్యోగం అవసరం లేదన్నారు. అధికారుల ప్రవర్తన చూస్తుంటే కఠిన చర్యలు తీసుకోవాలని పిస్తుందన్నారు. అనంతరం అధికారులకు ఈ నెల 26న గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్ చక్రధర్‌బాబు పలు సూచనలు చేశారు. ఉదయం 7.30 గంటలకు మండలాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలన్నారు. 8.30 గంటలకు జిల్లా స్థాయిలో జాతీయ పతాకం ఆవిష్కరణ జరుగుతుందన్నారు. వేడుకల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా కోవిడ్ నిబంధనలకు లోబడి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. 10 ఏళ్ల లోపు, 60 ఏళ్ల పైబడిన వారిని వేడుకల్లో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు సమన్వయంతో ప్రొటోకాల్ ఉల్లంఘన జరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులందరికీ ఆహ్వానపత్రాలు పంపాలన్నారు. కార్యక్రమాలకు హాజరయ్యే వారందరికీ సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమాలు జరిగే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధులను వేడుకలకు ఆహ్వానించి వారిని ప్రత్యేకంగా సన్మానించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ వెంకటరావు, వివిధ శాఖల, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను అభివృద్ధి చేస్తాం

- ఈడీ ఆదామ్‌సాహేబ్



ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈడీ ఆదామ్‌సాహేబ్

పొదలకూరు: కొంతకాలంగా ఉపయోగంలో లేని పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ అభివృద్ధి చేయడంతో పాటు బస్టాండ్ లోపలకు బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే ఆదామ్‌సాహేబ్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్, పంచాయతీ బస్టాండ్లను బుధవారం ఈడీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పెరిగిన కంపకర్ర చెట్లను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తామన్నారు. బస్‌స్టేషన్ ముందునున్న స్థలాలను 15 సంవత్సరాల లీజుకు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్థలం లీజుకు తీసుకున్న వారు దుకాణాలను సొంతంగా నిర్మించుకుని వ్యాపారాలు చేసుకోవచ్చునన్నారు. పంచాయతీ బస్టాండ్ సైతం సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ ముందుకు వస్తుందన్నారు. ఈ పంచాయతీ బస్టాండ్‌ను ఆర్టీసీకి అందజేస్తే అభివృద్ధి చేస్తామన్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు బస్‌షెల్టర్ సక్రమంగా లేదని, మంచినీటి సౌకర్యం కూడా కల్పించాల్సి ఉందన్నారు. పంచాయతీ బస్టాండ్ ప్రయాణికులకు అనుకూలంగా ఉన్నందున తమకు అప్పగిస్తే అభివృద్ధి చేయడంతో పాటు, సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈడీ వెంట డిప్యూటీ సీటీఎం చిరంజీవి, రాపూరు డీఎం అనిల్ తదితరులు ఉన్నారు.

అట్టహాసంగా నెట్‌బాల్ పోటీల ప్రారంభం

- ఉత్సాహంగా పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్డీఓ తదితరులు



క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న వివిధ జిల్లాల బాలుర జట్లు

ఆత్మకూరు: 66వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి అండర్-19 నెట్‌బాల్ పోటీలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం అట్టహాసంగా మొదలయ్యాయి. ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి పోటీలను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారుల నుంచి అతిథులు గౌరవ వందనం స్వీకరించారు.

తొలిరోజు ఫలితాలు

తొలిరోజు పోటీలు హోరాహోరీగా జరిగాయి. పలు బాలబాలికల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయని నెట్‌బాల్ పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి తిరుపతయ్య తెలిపారు. బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లా జట్టు, పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై 11-05 గోల్స్ తేడాతో, వైఎస్సార్ జిల్లా జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 13-12, కృష్ణా జిల్లా జట్టు విశాఖ జిల్లా జట్టుపై 13-01, అనంతపురం జట్టు చిత్తూరు జిల్లా జట్టుపై 14-01, నెల్లూరు జిల్లా జట్టు విజయనగరం జిల్లా జట్టుపై 12-0 గోల్స్ తేడాతో నెగ్గాయి. బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు విజయనగరం జిల్లా జట్టుపై 3-01 గోల్స్ తేడాతో, వైఎస్సార్ జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 12-07, కృష్ణా జిల్లా జట్టు నెల్లూరు జట్టుపై 11-01 గోల్స్, తూర్పుగోదావరి జిల్లా జట్టు విశాఖ జట్టుపై 6-01 గోల్స్ తేడాతో గెలుపొంది క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. నెట్‌బాల్ పోటీలను చూసేందుకు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో కళాశాల పీడీ ఎస్.వెంకటేశ్వర్లు, ఆత్మకూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసులు, హెచ్‌ఎం శేషాద్రివాసు, ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ మల్లికార్జున, వివిధ జిల్లాల కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

- పల్లె, పట్టణాల్లో జోరుగా పిండివంటల తయారీ
- పెద్ద పండగకు అరిసెలు ప్రత్యేకం
- బిజీబిజీగా మహిళలు, యువతులు

సంక్రాంతి ఘుమఘుమలు

సంక్రాంతి పేరు వింటే చాలామందికి గుర్తుకొచ్చేది పిండివంటలు. పెద్ద పండగకు మరికొద్దిరోజులే ఉండడంతో అరిసెలు, లడ్డూలు తదితరాల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. సామగ్రి కొనుగోలు, పిండి ఆడించడం లాంటి పనులతో బిజీబిజీగా గడుపుతున్నారు. చుట్టుపక్కల వారిని, బంధువులను పిలిచి సందడి వాతావరణంలో ఎంతో సంతోషంగా రుచికమైన ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు.



పొదలకూరు: అరిసెలు తయారు చేస్తున్న మహిళలు

పొదలకూరు: సంక్రాంతి వస్తోందంటే గ్రామాల్లో, పట్టణాల్లో వారంరోజుల ముందు నుంచే పిండివంటల ఘుమఘుమలు మొదలవుతాయి. మహిళలు రకరకాల పిండివంటలను చేస్తుంటే వారికి యువతులు, పిల్లలు సహకారం అందిస్తుంటారు. ప్రధానంగా సంక్రాంతికి తయారు చేసే వంటల్లో అరిసెలది ప్రత్యేక స్థానం. సంప్రదాయ వంటల్లో ఇవి ముందువరుసలో ఉంటాయి. తర్వాత లడ్డూలు, మైసూరుపాకు, కజ్జికాయలు, జిలేబీ, కొబ్బరి అరిసెలు, ఉప్పుచెక్కలు, మనూబూలు (జంతికలు) తదితర పిండివంటలు చేస్తుంటారు. వంటలు చేయటమే కాక బంధుగణానికి, చుట్టుపక్కల ఉండే ఇతర మతస్తులకు పంపడం ఇక్కడ అనాదిగా వస్తున్న ఆచారం. ప్రస్తుతం పల్లెల్లో పిండివంటల సందడి అంతా ఇంతా కాదు. మహిళలు, యువతులు పొయ్యి వద్ద చేరి తలో చెయ్యేసి వంటలు పూర్తి అయ్యేందుకు సహకరిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ అనేకచోట్ల పిండివంటల తయారీ జోరుగా సాగుతోంది. కాగా కొన్ని సంవత్సరాలుగా స్వీట్‌షాపుల నిర్వాహకులు పండగ పిండివంటలను తయారు చేసి విక్రయిస్తున్నారు. మరికొందరు ఆర్డర్లపై చేసిస్తున్నారు. కొందరు వీరిని ఆశ్రయిస్తున్నారు.


అరిసెల తయారీలో..



నువ్వులతో చేసిన అరిసెలు

రబీ సీజన్లో పల్లెల్లో వరిసాగు చేస్తూ కలుపు తీయడం, మందు పిచికారీ చేయడం వంటి పొలం పనులున్నా అనేకమంది మహిళలు వాటిని మానుకుని అరిసెల తయారీలో నిమగ్నమయ్యారు. అరిసెలు సంప్రదాయ వంటకంగా వస్తుండడంతో పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్కరూ వాటిని తయారు చేస్తారు. పండగలకు నాలుగైదు రోజుల ముందు మాత్రమే చేసుకుంటారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే అరిసెలు నూనెవాసన వస్తుంటాయి. బంధువుల ఇళ్లలో అశుభాలు జరిగి పండగ చేసుకోలేని వారికి అరిసెలను అందజేయడం ఎన్నోఏళ్లుగా వస్తున్న ఆచారం.

కజ్జికాయలు



పెద్ద పండగ పిండివంటకాల్లో కజ్జికాయలకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఇంట్లో అరిసెలతోపాటు కజ్జికాయలు కూడా ఉండాల్సిందే. వీటి తయారీకి ఖర్చు తక్కువే. దీంతో మహిళలు విధిగా కజ్జికాయలను సంక్రాంతి పిండివంటకాల్లో చేరుస్తుంటారు.

లడ్డూలు

అరిసెల తర్వాత గ్రామాల్లో లడ్డూల తయారీకి ప్రత్యేక స్థానం ఉంది. ఈ పిండివంటకాన్ని కూడా తప్పనిసరిగా తయారు చేస్తారు. కిలోల వంతున చేసి పండగలకు వచ్చే బంధువులకు పెడుతుంటారు.



జంతికలు

మనుబూలనే జంతికలు అని కూడా అంటారు. గ్రామాల్లో పండగ సమయంలో తప్పనిసరిగా ఉండే పిండివంటకాల్లో ఇది కూడా ఒకటి. స్వీట్ తిన్న తర్వాత మనుబూలను పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. పిల్లలు వీటిని ప్రియంగా తింటారు.



ఆత్మకూరులో పిండి ఆడించుకుంటున్న మహిళలు

జిలేబీ, జాంగ్రీ



జిలేబీలు

జిలేబీ, జాంగ్రీలను గ్రామాల్లో పెద్ద పండగకు ఇష్టంగా తయారు చేసుకోకున్నా పట్టణ ప్రాంతాల పిండివంటకాల్లో ఇవి ఉంటాయి. చాలామంది కిలోల వంతున స్వీట్ స్టాల్స్‌లో కొనుగోలు చేస్తుంటారు.

'వెంకయ్య' మార్నింగ్ వాక్



వాకింగ్ చేస్తున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం: నిత్యం భద్రతా వలయంలో ఉండే మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సామాన్య వ్యక్తిలా రోడ్డుపై మార్నింగ్ వాక్ చేసి స్థానికులను ఆశ్చర్యపరిచారు. ఐదురోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 9వ తేదీన ఆయన మండల కేంద్రమైన వెంకటాచలంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌కు వచ్చారు. బుధవారం ఉదయం ట్రస్ట్ నుంచి కసుమూరు క్రాస్‌రోడ్డు వరకు మార్నింగ్ వాక్ చేశారు. ఆ సమయంలో ఆయన్ను నడిచి, వాహనాల్లో వెళ్తున్న వారు ఆసక్తిగా గమనించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు			
బ్రాయిలర్ (లైవ్)	: 118	బ్రాయిలర్ చికెన్	: 208
లేయర్ (లైవ్)	: 85	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
		లేయర్ చికెన్	: 145

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)		
	పెద్దవి	: రూ.15
	సన్నవి	: రూ.9
	పండ్లు	: రూ.3

వినియోగదారుల చట్టంపై అవగాహన

- ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ ఏర్పాటు
- జేసీ కూర్మనాథ్

నెల్లూరు(అర్బన్): వినియోగదారుల చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జేసీ కూర్మనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆహార - పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయంలో వినియోగదారుల వ్యవహారాలు, ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సెంటర్ పరిధిలో టోల్‌ఫ్రీ నంబర్లు 1800 425 0082/1967 (పౌరసరఫరాల శాఖ), 1800 425 3157/14445 (ఒకేదేశం-ఒకే రేషన్‌కార్డు), 1800 425 2388/155235 (రాష్ట్ర ఆహార కమిషన్), 1800 425 4202 (తూనికలు, కొలతల శాఖ) నంబర్లను 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. కాల్ సెంటర్ ద్వారా వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్‌బంకులు, తూనికలు కొలతలు, బియ్యం కార్డు సేవలు తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత శాఖకు సమస్యను పంపుతామన్నారు. ఈ సెంటర్ ఈనెల 10వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల్లోపు ఫిర్యాదులు చేయొచ్చన్నారు.

తీర్థయాత్రలో అపశ్రుతి

- కారు ఢీకొని మహిళ మృతి



సునీతా సుధీర్ మృతదేహం

కొడవలూరు: తీర్థయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. మార్గమధ్యలో భోజనం చేసేందుకు దిగిన యాత్రికురాలిని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని నార్తురాజుపాళెం జాతీయ రహదారిపై ఆంజనేయస్వామి గుడి వద్ద బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్ర నుంచి కొందరు వ్యక్తులు కొద్దిరోజుల క్రితం ప్రత్యేక బస్సులో తీర్థయాత్రలకు బయలుదేరారు. వారు తిరుమలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. ఇతర ఆలయాల సందర్శనకు బయలుదేరారు. నార్తురాజుపాళెం జాతీయ రహదారి వద్ద ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చారు. ఇక్కడ విశాలమైన ప్రదేశం ఉండడంతో భోజనం చేసి విశ్రాంతి తీసుకునేందుకు ఆగారు. భోజనం చేశాక ఒకరిద్దరు మహిళలు దుస్తులు ఉతకడం ప్రారంభించారు. సునీతా సుధీర్ (50) కూడా దుస్తులు ఉతికి డివైడర్‌పై ఆరేసి ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చారు. ఈక్రమంలో కావలి వైపు అతివేగంగా వెళ్తున్న కారు హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చిన సునీతా సుధీర్‌ను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఆమె డివైడర్‌పై పడి అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో తోటి యాత్రికులు విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై జి.సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. ఆగకుండా వెళ్లిపోయిన కారును త్వరలోనే గుర్తిస్తామన్నారు.